# సంయమనమే శ్రీరామరక్ష

జయప్రకాష్ నారాయణ్

**BB-17-April-2006**

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)

...స్వేచ్ఛా సమాజంలో ప్రసార సాధనాలు ప్రజాస్వామ్యానికి కాపలాదారుగా వ్యవహరిస్తాయి. స్వేచ్ఛను పరిర క్షించడంలో నైతిక సాధనాలుగా ఉపయోగపడతాయి. ప్రసారసాధనాలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచే స్తాయి. వేటిని ఆదరించాలో, వేటిని నిరాకరించాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛ మనకు ఉంటుంది. ఫలానా పత్రి కనే చదవాలని, లేదా ఫలానా ఛానల్‌నే చూడాలని నిర్బంధం ఎవరి మీదా ఉండదు. ప్రజలు కాదన్నప్పుడు ఏ పత్రికా, ఏ ఛానలూ మనుగడ సాగించజాలవు...

వివిధ వర్గాల మధ్య అపనమ్మకం, అసహనం మన సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటి. ఒక కుటుంబం, కులం, వృత్తి, వర్గం లేదా కార్మిక సంఘం ఉమ్మడి ప్రయోజనాలు కలిగి ఉంటాయి. మంచి జరిగినా, చెడు జరిగినా అందరి పైనా ప్రభావం పడుతుంది. ఆయా సందర్భాల్లో విభేదాలు తలెత్తినా- ఉమ్మడి ప్రయోజనాసక్తి లేదా బంధుత్వ బంధాలు కలిగిన ఈ వర్గాల్లోని వ్యక్తులు ఒక్కుమ్మడిగానే వ్యవహరి స్తారు. మనదేశంలో కుటుంబ సంబంధాలు, కులపరమైన బంధాలు ఎంతో పటిష్టంగా ఉన్నాయి. తమ వర్గాన్ని పరిరక్షించడానికి ఆయా వర్గాల్లోని వారు ఎంతకైనా తెగిస్తారు. వారు ఏమాత్రం సంయమనం పాటిం చకపోవడం, ఒక్కోసారి ఇతరులపై దాడులకు పూనుకోవడం ఆందోళన కలిగిస్తోంది. 'స్వరక్షణ- పరభక్షణ' ముఖ్యమైపోవడంతో సమాజానికి ఎంతో హాని జరుగుతోంది. ఇలాంటి వైఖరివల్ల సమాజం ఉమ్మడి శ్రేయం కోసం ప్రతిఒక్కరూ తమ వంతు కృషి చేసేలా చేయడం కష్టమవుతోంది. ఎవరి ధోరణిలో వారు నడచుకోవ డంతో దేశంలో కలహాల కుంపట్లు రాజుకొంటున్నాయి.

### *ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకపాత్ర*

ప్రసారసాధనాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి ఇటీవల చేసిన వ్యాఖ్యలు- మన సమాజంలో వివిధ వర్గాలు- వృత్తుల మధ్య అపనమ్మకానికి నిదర్శనాలు. ప్రసార సాధనాల పైన, దిగజారుతున్న పత్రికల విశ్వసనీయత మీదా ప్రధాన న్యాయమూర్తి కొన్ని తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు వార్తలు వచ్చాయి. మన సంస్థల్లో ఏదీ నూటికి నూరుశాతం నికార్సయినది కాదన్నమాట నిజమే. అలాగే ప్రసార మాధ్యమాల్లోనూ కొన్ని లోసుగులు లేకపోలేదు. కానీ స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో అధి కార, రాజ్యాంగసంస్థలు విఫలమైన ప్రతిసారీ ప్రసార సాధనాలు పౌరుల పక్షాన నిలబడి, వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించాయని ఏ నిష్పాక్షిక విశ్లేషణలోనైనా వెల్లడి అవుతుంది. తప్పుడు వార్తలు, సంచల నాత్మకత, పక్షపాతాలకు కొన్ని సమయాల్లో అవినీతికి అనేక దేశాల్లోని ప్రసార సాధనాలు పెద్దపీట వేస్తు న్నాయి. కానీ స్వేచ్ఛా సమాజంలో ప్రసార సాధనాలు ప్రజాస్వామ్యానికి కాపలాదారుగా వ్యవహరిస్తాయి. స్వేచ్ఛను పరిరక్షించడంలో నైతిక సాధనాలుగా ఉపయోగపడతాయి. ప్రసారసాధనాలు స్వేచ్ఛాయుత వాతావ రణంలో పనిచేస్తాయి. వేటిని ఆదరించాలో, వేటిని నిరాకరించాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛ మనకు ఉంది. ఫలానా పత్రికనే చదవాలని, లేదా ఫలానా ఛానల్‌నే చూడాలని నిర్బంధం ఎవరిమీదా ఉండదు. ప్రజలు కాదన్నప్పుడు ఏ పత్రికా, ఏ ఛానలూ మనుగడ సాగించజాలవు.

అలాగే, మన న్యాయ వ్యవస్థలోనూ ఎన్నో లోటుపాట్లు ఉన్నాయి. పెద్ద సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సత్వర న్యాయం అందడం లేదు. నేరగాళ్లు తప్పించుకోగలుగుతున్నారు. విచారణ ప్రక్రియలు సంక్లిష్టంగా ఉన్నాయి. దావాలకు ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. అవినీతివల్ల కొన్నిసార్లు ఆయా సంస్థలపై నమ్మకం సడలిపోతోంది. చివరకు రాజ్యాంగ విలువలను, స్వేచ్ఛను న్యాయవ్యవస్థ నిలబెడుతోంది. ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడుతోంది. చివరకు వెల్లడయ్యేదొక్కటే. అదేమిటంటే- నిరంకుశ శక్తుల బారినుంచి పౌరులను కాపాడేది న్యాయ వ్యవస్థే. అందువల్ల న్యాయ వ్యవస్థను విమర్శించే సందర్భంలో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. న్యాయ వ్యవస్థ, ప్రసార సాధనాలు- రెండూ మనదేశంలో ఎంతో విశ్వసనీయత కలిగిన వ్యవస్థలే. ఇవి రెండూ ఒక్కసారి ఢీకొనడం ఆందోళన కలిగిస్తోంది. తీవ్ర రాజ్యాంగ సమస్యల విషయంలో వాటిమధ్య ఏకీభావం కుదరటం లేదంటే అర్థం చేసుకోవచ్చు. కానీ పరస్పర అపనమ్మకం, అవిశ్వాసంతో అవి ఇలా వ్యవహరించడంవల్ల ఆ రెండూ నష్టపోతాయి. దేశ ప్రజలు మరింతగా నష్టపోతారు. సాక్ష్యాధారాలు ఉన్నప్పుడు, సహేతుక కారణాలపై ఏ సంస్థ పైన అయినా విమర్శలు చేయడం అవసరమే. అయితే దానికీ కొన్ని పరిమితులు ఉండాలి. వాస్తవికంగా ఆలోచించాలి. ఏ సంస్థలోనైనా లోటుపాట్లు సహజమే. ప్రపంచంలో ఏదీ లోపరహితంగా ఉండదు. అందువల్ల సమగ్ర దృక్పథంతో వ్యవహరించాలి. అన్నింటికన్నా ముఖ్యంగా విశాల జనహితంకోసం అన్ని సంస్థలూ కలసికట్టుగా పాటుపడాల్సిన అవసరం ఉంది. ఈ దృష్ట్యా- విమర్శలు నిష్పక్షపాతంగా, సమతుల్యంగా, నిర్మాణాత్మకంగా ఉండాలి. ప్రజాస్వామ్యంలో ఆయా సంస్థల పనితీరును నిరంతరం మెరుగు పరచాల్సిన బాధ్యత మనమీద ఉంది. ప్రజాసామ్యం పరిపుష్టం కావాలంటే నూతన ఆవిష్కరణలు, సృజనాత్మక పరిష్కారాలు, దిద్దుబాటు చర్యల కోసం సంస్థాగత యంత్రాంగాలు కీలకం. సంయమనం కోల్పోయి దాడులకు తెగబడటం, పరులకు చెరుపుచేసే రీతిలో విమర్శలకు పాల్పడటం వల్ల సమస్య పరిష్కారం కాకపోగా, అవే సమస్యలో భాగమైపోతాయి.

వివిధ వర్గాలమధ్య ఇలాంటి అపనమ్మకం సమాజంపైనే దుష్ప్రభావం చూపుతోంది. ఇది పార్టీలకు, వివిధ ప్రభుత్వ విభాగాలకు, సంస్థలకు లేదా ప్రసార సాధనాలకు, న్యాయ వ్యవస్థకూ పరిమితం కాలేదు. కుటుంబాలు, కుల వ్యవస్థకు వెలువల అనేకవర్గాలు పరస్పరం ఇలాంటి విమర్శలకు పాల్పడుతున్నాయి. శత్రుత్వ భావనతో వ్యవహరిస్తున్నాయి.

కొంతకాలం కిందట మన రాష్ట్రంలోని ఓ నగరంలో వైద్యులకు, విలేకరులకు మధ్య వివాదం తలెత్తింది. ఇందుకు దారితీసిన కారణం చాలా స్వల్పమైంది. గర్భంతో ఉన్న ఒక మహిళను ఆమె బంధువులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె విషరక్తత (టాక్సీమియా)తో పాటు అనేక ఇతర రుగ్మతలతో బాధపడుతోంది. చాలారోజులు కోమాలో ఉన్న తర్వాత ఆమె కన్నుమూసింది. దీంతో ఆమె బంధువులు కోపోద్రిక్తులయ్యారు. ఆస్పత్రివర్గాలు నష్టపరిహారం చెల్లించాలంటూ పట్టుబట్టారు. కేసు ఎంతో క్లిష్టమైనదే అయినా, వైద్యులు రోగికి చికిత్స అందజేశారు. రోగిది బీదకుటుంబం కావడంతో ఆస్పత్రి బిల్లును మాఫీచేసేందుకూ సిద్ధపడ్డారు. అయితే పరిహారం చెల్లించేందుకు మాత్రం అంగీకరించలేదు. ఈ ఉదంతంపై ఆ మరుసటిరోజు పత్రికల్లో తప్పంతా వైద్యులదే అన్నట్లుగా నాటకీయమైన శీర్షికలతో వార్తా కథనాలు వెలువడ్డాయి. ఇది చూసి ఆగ్రహించిన వైద్యులు స్థానికంగా విలేకరుల సమావేశం నిర్వహించి, వాస్తవాలను వివరిద్దామని నిర్ణయించుకొన్నారు. ఆ తరవాతే పరిస్థితి హించని విధంగా మలుపు తిరిగింది. విజ్ఞులైన కొద్దిమంది వైద్యులు విలేకరు

లతో మాట్లాడటానికి బదులు, మొత్తం వైద్యులందరూ కలసి మీడియా వారిని పిలిపించి, ఓ గదిలో బంధిం చారు. తప్పుడు వార్తలు రాస్తున్నారంటూ వారిని తూలనాడారు. ఇందుకు ప్రతిగా విలేఖరులు కూడా వైద్యుల ను దుర్భాషలాడారు. రోగుల్ని పీల్చిపిప్పి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలనే కూల్చివేసిన పత్రికలకు ఆస్పత్రులను మూయించడం చిటికెలోపని అని సవాల్ చేశారు. ఉభయపక్షాలు ఇలా వాదులాడుకున్నాక, ఎవ రిదారిన వారు వెళ్లిపోయారు. హించినట్టుగానే ఆ మరునాడు పత్రికల్లో వైద్యుల దురుసుతనాన్ని ఎండగ డుతూ వార్తలు వచ్చాయి. కొద్దిరోజులు గడిచాక- ఉభయ వర్గాలకు మధ్య రాజీ కుదర్చవలసిందిగా ఓ వైద్యు ల బృందం నన్ను కోరింది. తమ ప్రవర్తనపట్ల వైద్యుల్లో పశ్చాత్తాపమేమీ కనిపించలేదు. విలేకరులకు తగిన శాస్తి జరగాల్సిందేనన్న వారి ధోరణిలో ఏమాత్రం మార్పులేదు. విలేకరులను అడిగితే, వారు కూడా వైద్యులపై తాము ప్రచురించిన వార్తలు సమంజసమైనవేనని సమర్థించుకున్నారు. ఓ వైద్యుడు మరింత ముందుకువెళ్లి, ప్రజల్ని తప్పుబట్టారు. రోగుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు రేయనక, పగలనక శ్రమిస్తూ ఉంటారని, అయినా వారికి తమపట్ల కృతజ్ఞతాభావం లేదని ఆయన నిష్ఠూరమాడారు. ఎవరికివారు తాము చెప్పిందే సరై నదని, అవతలివారిది తప్పనే తీరులో వ్యవహరిస్తుంటారని చెప్పడానికి సదరు వైద్యుడు చేసిన వ్యాఖ్యలే నిద ర్శనం. అలాంటివారు 'వాళ్లు వేరు, మేం వేరు' అంటూ సమాజాన్ని రెండుగా విభజించి చూసే మనస్తత్వాన్ని కలిగి ఉంటారు. వైద్యులు సహా ఇతర వృత్తుల్లో కొనసాగేవారంతా సమాజానికి సేవలు అందించేందుకే ఉన్నారని, తద్వారానే వారు జీవనోపాధి పొందుతున్నారని నేను ఆ వైద్యుడికి విస్పష్టంగా చెప్పవలసి వచ్చింది.

### *మహాత్ముడి బోధనలే మార్గదర్శకం*

తామున్నది సమాజం కోసమేననే సత్యాన్ని చాలామంది విస్మరించి, 'మనది-ఇతరులది' అనే పక్షపాతధోరణితో వ్యవహరిస్తుంటారు. అలాంటి వారివల్ల సమాజానికి ఎంతో చెడు జరుగుతుంది. ఈ సందర్భంగా- వ్యాపారవ ర్గాలకు వినియోగదారుడి ప్రాముఖ్యత గురించి తెలియజేస్తూ మహాత్మాగాంధీ చేసిన వ్యాఖ్యలు గుర్తుచేసుకోవ లసిన అవసరం ఉంది. "మన వ్యాపారానికి వినియోగదారుడు ఎంతో ముఖ్యమైన వ్యక్తి. అతను మనపై ఆధారపడిలేడు. మనమే అతనిపై ఆధారపడి ఉన్నాం. అతను మనపనికి ఎంతమాత్రం ఆటంకం కాదు. పైపెచ్చు మన వ్యాపారం సాగేదే అతనివల్ల. వినియోగదారుడు మన వ్యాపారానికి సంబంధించని వ్యక్తికాదు. అతను మన వ్యాపారంలో భాగం. అతనికి సేవలందించడమంటే మనం తనకు సాయపడుతున్నట్లు కాదు. సేవలందించే అవకాశాన్ని మనకు ఇవ్వడంద్వారా వినియోగదారుడే మనకు సాయపడుతున్నాడు"- గాంధీజీ చేసిన ఈ హితబోధ అందరికీ శిరోధార్యం కావాలి. మనమున్నది ప్రజలకోసం తప్ప, ప్రజలున్నది మనకోసం కాదు. ఈ విషయాన్ని న్యాయమూర్తులు, విలేకరులు, వైద్యులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, మేనేజర్లు వంటివారంతా గుర్తెరిగి మసలుకోవాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అందరూ తమవంతు పాత్రను పోషించాలి. మన జీవన విధానాలు మెరుగయ్యేందుకు మన ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలప డేందుకు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలి.